ప్రజాశక్తి

శుక్రవారం 24 నవంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

అకాల వర్షంతో రైతులు బెంబేలు

కల్లాల్లో ధాన్యాన్ని కాపాడుకునే పనిలో నిమగ్నం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట, కంకిపాడు : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న రైతులపై ప్రకృతి కూడా పగపట్టినట్లుంది. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో పంట చేతికందే సమయంలో గురువారం ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు కల్లాల్లోని వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. పరద పట్టాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. తడిసిన ధాన్యం మొక్క వస్తుందన్న ఆందోళనతో ఎంతోకొంత సొమ్ము చేసుకుని నష్టాల నుంచి గట్టు కొంతవరకైనా గట్టెక్కడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కల్లాల్లో రాసులు పోసిన ధన్యాం, మరోపక్క అప్పటికే నూర్చిన ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తి మిల్లుకు తరలించడానికి సిద్ధమవుతున్న తరుణంలో వర్షం కురిసింది. దీంతో కల్లాల్లోకి వర్షం నీరు చేరి మొత్తం ధాన్యం తడిసిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు పంట చేతికందే సమయంలో సకాలంలో నీళ్లు లేక వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టినా ఫలితం లేక కళ్లముందే పంట ఎండిపోయి కొందరు రైతులు నష్టాల బారిన పడ్డారు. మరికొందరు రైతులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమీపంలోని బోర్లు, బావులకు పైపులేసి ఎండిపోతున్న

కంకిపాడు ప్రాంతంలో ధాన్యాన్ని కల్లాల నుండి తరలిస్తున్న రైతులు

జగ్గయ్యపేట ప్రాంతంలో ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

పంటలను బతికించుకున్నారు. పంటలు పండడంతో కోత కోసి, నూర్పుడి చేసి కల్లాల్లో ఆరబెట్టి ఉన్నారు. ఇటువంటి తరుణంలో ఒక్కసారిగా వర్షం రావడంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పేందుకు ప్రయత్నించారు. ఈ వర్షాలు బిటి పత్తి పంటకు సైతం భారీ నష్టాన్ని కలిగించే పరిస్థితి ఏర్పడింది. జగ్గయ్యపేట మండలంలో పత్తి తీతలు జోరుగా సాగుతున్నాయి. ఈ సమయంలో వర్షం రావడంతో పత్తి నలుపు వచ్చి నష్టం కలిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి పంటకు సైతం నష్టాన్ని కలిగించే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. మిర్చి కొమ్మలు విరిగి నష్టాల బారిన పడే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే మిర్చి పంటపై లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఉన్నామని, ఈ సంవత్సరమైనా మిర్చి పంట లాభాలు వస్తాయని ఆశతో వేలాది రూపాయలు వెచ్చించి కౌలుకు తీసుకొని, సాగుకు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బికెల్లో పండిన ధాన్యానికి సరిపడా సంచులు కూడా ఇవ్వటంలేదని రైతుల ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, వర్షంతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాఠశాలల్లో టీచర్ల కొరత

విద్యా రంగ సంస్కరణలతో సమస్యలు

రేష్నలైజేషన్తో తగ్గిన ఉపాధ్యాయ పోస్టులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లా బందరు మండలం కోన హైస్కూల్ ఇంగ్లీష్ టీచర్‌ను డిప్యూటేషన్‌పై మరో స్కూల్‌కు పంపారు. దీంతో కోన హైస్కూల్‌లో పాఠ్యాంశాల బోధనకు ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు స్పందనలో అర్జీ ఇచ్చారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కంభంపాడు హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్ లేరు. మరోవైపు ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో 200 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉందని ఇటీవల జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా జడ్‌పి సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు....ఇలా ఉమ్మడి కృష్ణాజిల్లాలో అనేక ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంపై తల్లిదండ్రుడులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిలబస్ రివిజన్ చేయించాల్సిన సమయంలోనూ అనేక ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇంకా సిలబస్ పూర్తికాలేదు. ఈనేపథ్యంలోనే తమ పిల్లలు పదో తరతగి గట్టెక్కుతారో లేదోనని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా (పాత కృష్ణాజిల్లా) వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 4,400కి పైగా ఉన్నాయి. వీటిలో 600లకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 15,440 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వివిధ పాఠశాలల్లో 1100 మంది వరకు మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలన్నీ 117 జివో ప్రకారం విదార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా సర్దుబాటు చేసినట్లు (మిగతా 6లో)

దుర్గగుడి అభివృద్ధికి శ్రీకారం

రూ.200 కోట్లతో పనులు

త్వరలో సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) తర్వాత అంత ప్రఖ్యాత గాంచిన విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దాదాపు రూ.200 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఆలయంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలనే దానిపై దేవాలయం పాలకమండలి, అధికారుల ఆధ్వర్యంలో ఇది వరకే ఒక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. దాదాపు రూ.225 కోట్లతో రూపొందించిన ప్రణాళికకు పాలక మండలి ఆమోద ముద్ర వేసింది. టిటిడి తరహాలో క్యూలైన్లు, మంచినీటి వసతి, మరుగు దొడ్ల నిర్మాణం, ఆగ్నేయంలో మూడు అంతస్తుల్లో ప్రసాదంపోటు, విక్రయ కేంద్రం, స్టాక్ రూమ్‌లు, భక్తులు సేద తీరేందుకు డార్మెటరీలు, సామూహిక కళ్యాణ మండపం, ఒకేసారి 600 కార్లు నిలిపేందుకు పార్కింగ్ సౌకర్యం తదితర పనులకు శ్రీకారం చుట్టనున్నారు. తిరుపతిలో అలిపిరి ప్రవేశ మార్గం మాదిరిగా ఇంద్రకీలాద్రిపై కూడా ప్రవేశ మార్గం ఏర్పాటుకు కూడా చర్యలు చేపట్టనున్నారు. త్వరలో వీటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకు స్థాపన చేయనున్నారు.

వెలంపల్లి హయాంలోను మాస్టర్ ప్లాన్

దేవాదాయ శాఖ మంత్రిగా వెల్లంపల్లి శ్రీనివాస్ ఉన్న సమయంలో దేవాలయం అభివృద్ధికి ఒక మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. ఇందులో ప్రసాదంపోటు, అన్నదాన భవనం, కేశ ఖండనశాల, కళ్యాణ మండపం తదితర నిర్మాణాలు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. 2020లో దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన సందర్భంలో దుర్గమ్మ దేవాలయాభివృద్ధికి రూ.70 కోట్లు విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోడంతో అవి కార్యరూపం దాల్చలేదు.

నూతన ప్లాన్

దేవాదాయ శాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ వచ్చిన తర్వాత దానిని పక్కన పెట్టి కొత్త ప్లాన్ రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. గుడ్‌గావ్‌కు చెందిన నిపుణులతో ఈమాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు సమాచారం. దాదాపు రూ.225 కోట్లతో దీనిని తయారు చేయించారు. విజయవాడ ఇందిరాగాంధీ (మిగతా 6లో)

రైల్వేల ప్రైవేటీకరణను నిలిపేయాలి

విజయవాడ, మచిలీపట్నం రైల్వేస్టేషన్ల వద్ద ధర్నాల్లో నేతల డిమాండ్

విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : రైల్వేల ప్రైవేటీకరణ ఆపాలని ఎపి రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) కార్యదర్శి వివిఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. సిఐటియు, ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఇతర ప్రజా సంఘాల పిలుపు మేరకు గురువారం విజయవాడ, మచిలీపట్నం రైల్వేస్టేషన్ల వద్ద కార్మికులు, ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద ఎపి రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నరసింహులు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైల్వేలను ప్రైవేటీకరణ పేరుతో అదానీ, అంబానీ వంటి కార్పొరేట్, విదేశీ సంస్థలకు అమ్మడానికి సిద్ధం చేసిందని విమర్శించారు. రూ.లక్షల కోట్లు ప్రతియేటా అర్జిస్తున్న రైల్వేను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం ప్రజావ్యతిరేకం అన్నారు. 100 రూట్లలో 151 రైళ్లను ప్రైవేటు వారికి నడుపుకోవడానికి, 400 రైల్వే స్టేషన్లను, 360 గూడ్స్‌షెడ్స్, ప్రొడక్షన్ యూనిట్లను, వివిధ డిపార్టుమెంట్లలో విభాగాలు, రైల్వే ఆస్తులను ప్రైవేటు వారికి అప్పజెప్పబోతున్నారని అన్నారు. కీలకమైన సిగ్నలింగ్ వ్యవస్థ మెయింటెనెన్స్, రైల్వేట్రాక్ నిర్వహణ తదితర వాటి పనులను ప్రైవేటు వారికి ఇవ్వడం వల్లే జూన్ నెలలో ఒడిశాలోని బాలాసోర్, (మిగతా 6లో)

మచిలీపట్నంలో రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు

వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఈ నెల 26న 'భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని' పురస్కరించుకుని గురువారం 'భారత రాజ్యాంగ రచన – దాని ఆవశ్యకత 'అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం ఎన్జీవో "ఫ్రెండ్ సర్వీస్ సొసైటీ"స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 117 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం రచన – దాని ఆవశ్యకత గురించి విద్యార్థులు తెలుసుకోవడం కోసం అభినందనీయమన్నారు. విజేతలకు 26న జరిగే రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ గౌరవ సలహాదారుడు ప్రత్తిపాటి పాల్ఇమ్మానుయేలు, డైరెక్టర్ చాట్ల హన్న, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తబిత, ఉపాధ్యాయులు చైతన్య పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

గంపలగూడెం : కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని గురువారం ఉదయం మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట మండలంలోని గోసవీడు గ్రామ శివాలయంలో ప్రతిష్టించారు. పురోహితులు అరిపిరాల అయ్యప్ప శాస్త్రి, బందం ఈ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా విజయవంతం చేశారు. రాత్రి 7 గంటలకు మహా అన్నదాన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

అన్నదానం నిర్వహిస్తున్న దశ్యం

అన్నదానం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతుపేట సాయి మందిరంలో పుట్టపర్తి శ్రీ భగవాన్ సత్య సాయిబాబా వారి 98వ జయంతి సందర్భంగా గురు వారం అన్నదానం నిర్వహించారు. నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సత్య సాయి బాబా దేవస్థానం కన్వీనర్ యు వాసుదేవ రావు, కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలం నగరాల సత్రం ప్రారంభోత్సవానికి యాత్రికులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీశైలంలో శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల నగరాల కులస్తుల నిత్య అన్నదాన వసతి సత్రం ఈనెల 24న ప్రారంభంకానున్న శుభసందర్భంగా గురువారం శ్రీశైలం బయలుదేరిన శ్రీనన్నదళం సభ్యులు, యాత్రికుల బస్సును శ్రీనన్నదళం రాష్ట్ర అధ్యక్షులు పోతిన వరప్రకాష్ జెండా ఊపి ప్రారంభిం చారు. గురువారం కొత్తపేటలోని శ్రీనన్నదళం కార్యాలయం వద్ద నుంచి ఈ బస్సు శ్రీశైలం బయలుదేరి వెళ్లింది.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నందిగామ : మాగల్లులో రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శిఖరం గ్రానైట్ లేయింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. కొద్ది నెలల క్రితం పల్లగిరి శివారులో ఏర్పాటు చేసిన శ్రీ అష్టలక్ష్మి ఫౌండరీక మహాయాగానికి అప్పటి టీటీడీ చైర్మన్‌గా ఉన్న వై.వి.సుబ్బారెడ్డి గ్రానైట్ వితరణ చేశారని గుర్తు చేశారు. ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ సారధ్యంలో ఆలయ శిఖరభాగంలో గ్రానైట్ లేయింగ్ పనులను ప్రారంభించినట్లు వివరించారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నగర పంచాయితీ పరిధిలోని స్థానిక 10వ సచివాలయాన్ని కమిషనర్ బాలకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని ఇన్ స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు పట్టికను స్పందన రిజిష్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. ఎస్‌డిజి సర్వే, ఎపి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మా ణం పనులను క్రమంతప్పకుండా పర్యవేక్షించాలని కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు.



సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్ బాలకృష్ణ

పలుచోట్ల వైసిపి కార్యక్రమాలు

ప్రజాశక్తి - భవానీపురం : సిఎం జగనన్న నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పశ్చిమ నియోజకవర్గంలో 41, 42 డివిజన్లలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి సచివాలయంలో అమర్చిన పేదలకు చేకూరిన లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జండా దిమ్మను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక పెద్దలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వానికి మన జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాను వివరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టాం అని తెలిపారు. చంద్రబాబు చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలకు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఎండి ఇర్ఫాన్, పడిగపాటి చైతన్య రెడ్డి, గౌస్ మొహిద్దిన్, యశోధర్, రెహమాన్, అజీజ్ వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.**రెడ్డిగూడెం :** నవరత్నాల పథకాలతో ప్రజలందరి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే సిఎం జగన్ లక్ష్యమని మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అన్నేరావుపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొన్నారు. అన్నేరావుపేట సచివాలయంలో పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నేరావుపేట సచివాలయం పరిధిలో అభివద్ధికి రూ.3.08 కోట్లు ఖర్చు పెట్టగా, సంక్షేమం కోసం రూ.19.80కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. **గంపలగూడెం:** ప్రజాసంక్షేమంలో కులమతాలకు తావు లేకుండా సీఎం జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి తెలిపారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మేడూరులో గురువారం సాయంత్రం సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు.కార్యక్రమంలో మేడూరు, సత్యాలపాడు గ్రామాల సర్పంచులు వెన్నపూస గోవర్ధన్ రెడ్డి, గుండ్ల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కామసాని విజయనిర్మల పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో...

వన్‌టౌన్‌లో...

డివిఆర్, ఉమా కాలనీలు సమస్యలకు కేరాఫ్

డ్రైయినేజీ పరిస్థితి సక్రమంగా ఉండదు.. మురుగునీటి పారుదల లేక దుర్గంధం వెదజల్లుతుంటుంది. మరోవైపు పారిశుధ్యం అధ్వానం, సిసి రోడ్ల వసతీ సరిగ్గా లేదు. ఇక వీధి లైట్ల పరిస్థితి సరేసరి.. ఇదీ కనీస వసతులు లేని నందిగామ డివిఆర్, ఉమా కాలనీల పరిస్థితి.

ప్రజాశక్తి - నందిగామ :రెండు కాలనీలలో సుమారు ఐదు వేల జనాభా వున్నారు. జనసాంద్రత తగ్గట్టుగా మౌలిక వసతులు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలువలు పూడికతీత తీయకపోవటంతో మట్టితో పూడుకపోయి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. నడవటానికి సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ లు పూడికతీత తీయకపోవటంతో దోమలు విజంభించి ప్రజలు విష జ్వరాలకు గురై అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రులు చుట్టు తిరుగుతూ ఆర్థిక ప్రయాసలకు గురౌతున్నారు.

పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన దారి

పారుదల లేక నిల్వ ఉన్న మురుగునీరు

రోడ్ల పరిస్థితి దయనీయం :

ఉమా కాలనీ, డివిఆర్ కాలనీలలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. సిసి రోడ్లు లేవు. వర్షం వస్తే బురదమయం. మోకాళ్ల లోతు దిగబడుతుంది. కొన్ని ఇళ్ళకు రోడ్డు వసతి లేదు. కంప చెట్లు దాటుకుంటూ వెళ్లాలి. నడవటానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు.

వీధిలైట్లు వెలగటం లేదు :

కాలనీలలో శివారులో వీదిలైట్లు వెలగటం లేదు. చీకటి పడుతుంటే కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాములు, జెర్రిపోతులు తిరుగుతున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలనీలలో వీదిలైట్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అనధకారిక చెత్త డంపింగ్ :

రామన్న పేట రహదారి పక్కన ఉమా కాలనీ శివారు అనధికారికంగా చెత్త డంపింగ్ చేసి తగలబెడుతున్నారు. నందిగామ పట్టణంలో చెత్త మెత్తము తరలించి తగల పెట్టడం వల్ల పొగచూరి ప్రజలు ఊపిరి తిత్తులు వ్యాధులతో బాధపడుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. తక్షణమే చెత్త డంపింగ్ నియంత్రణ చేయాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్

ఇసుక అక్రమ తరలింపుపై కేసు నమోదు

గంపలగూడెం : గురువారం సాయంత్రం కనుమూరు రేవు నుండి ఆ గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా, వచ్చిన సమాచారం మేరకు 3 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు. గ్రామానికి చెందిన జెర్రిపోతుల తిరుపతిరావు, పుచ్చకాయల శివకృష్ణ, దొంతిపోయిన నాగేంద్రబాబులకు చెందినవిగా తెలిపారు. ఈ విషయమై వాల్టా చట్టం ప్రకారం కేసు నమోదు చేసి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతులూ లేకుండా, ఇసుక తరలింపు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాట్లాడుతున్న రవికుమార్

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను వివక్షతకు గురిచేస్తే 2017 యాక్ట్ ప్రకారం చట్ట రీత్యా శిక్షార్హులవుతారని ఆరోగ్య సూపర్ వైజర్ సుందరరావు, మల్లెల సర్పంచ్ మరియమ్మ, సొసైటీ అధ్యక్షుడు కలకొండ రవికుమార్ అన్నారు. మండలంలోని మల్లెల సచివాలయంలో ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గురు వారం ఆరోగ్య సలహా సమావేశం జరిగింది. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అదొక వైరస్ అని ఎయిడ్స్ రోగులను తాకినా, పట్టుకున్న వారికి ఏమీ కాదని కేవలం రక్త మార్పిడి, వారికి వాడిన ఇంజక్షన్ల సూదుల ద్వారా మా త్రమే వస్తుందన్నారు. ఎయిడ్స్ రోగులతో ప్రేమగా మెల గాలని, వారిలో మనోధైర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశా రు. ఈ కార్యక్రమంలో లింకు వర్కర్ సరిత, ఆశ ఆరోగ్య కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన నాయకులు

ప్రజాశక్తి - మైలవరం : నందిగామ నుండి మైలవరం వచ్చిన నేతలు అభివద్ధిని విస్మరించి బూతుల పంచాయతీలు పెట్టుకోవడం సిగ్గుచేటని మైలవరం మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి దేవినేని, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ సహజ వనరుల దోపిడీలు వాటాలు కుదరక చిల్లర పంచాయతీలు చేసుకుంటున్నారన్నారు. వ్యక్తిగత దూషణలతో అభివృద్ధిని విస్మరించి నందిగామ నేతలు కాలక్షేపం చేస్తున్నారని అన్నారు.

గన్నే అన్న యూత్ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం మద్దుల పర్వ గ్రామానికి చెందిన బండి ఆకాశి ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. బాధితునికి వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ అలియాస్ అన్న రూ.15 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో పాలంకి సురేష్ రెడ్డి, ఉయ్యూరు వెంకటేశ్వర రెడ్డి, ముక్కాల రాజా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
శుక్రవారం 24 నవంబర్ 2023

27,28 తేదీల్లో మహాధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : కార్మిక సంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 27 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహా ధర్నా జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక శ్రామిక గుంటూరు బాపనయ్య భవనంలో జరిగిన మండల వ్యవసాయ కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు రాయితీపై టార్పాలిన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో గత ఖరీఫ్ సీజన్లో 3.50 లక్షల ఎకరాలలో వరి సాగు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పలు మండలాలలో వరి కోతలు, నూర్పిల్లు ప్రారంభం అయ్యాయని, గత రెండు రోజులుగా వాతావరణం లో మార్పులు కురుస్తున్న వర్షాలు కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూర్పుడు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసే సౌకర్యం లేక రైతులు దళారులకు అమ్ముకోలని పరిస్థితి ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. 75 కిలోల బస్తాను 1400 నుండి 1500 రూపాయల కు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారాల ద్వారా కొనుగోలు చేయటంలో వచ్చిన ఇబ్బందుల రిత్య ఈ సంవత్సరం ప్రైవేటు వ్యాపారస్తులకు వరి ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు అంటున్నారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు బండారు కోటేశ్వరరావు, నాయకులు మహమ్మద్ కర్లీముల్లా, కలపాల దావీదు, గోళ్ళ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** అంగన్వాడి, ఆశ వర్కర్, మధ్యాహ్నం భోజన కార్మికులకు జీతాలు పెంచాలని కష్ణాజిల్లా సిఐటియు నాయకులు చౌటపల్లి రవి అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని వీరంకులాకు బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నిరసనగా విజయవాడ జింఖానా గ్రాండ్స్ లో జరిగే 27 28 తారీకుల్లో జరిగే మహాధర్నాకు ను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గంగాధర ప్రసాద్,. విజయనిర్మల, అల్లా బక్షు, శంషాద్, ఆలీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కులగణన సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-పెదపారుపూడి : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణనకు సంబంధించి ప్రభుత్వం మార్గం నిర్దేశాలకు అనుగుణంగా పని చేయాలని ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కుల గణనపై వాలంటీర్ లకు శిక్షణా తరగతులు ముగిశాయి. ఎంపీడీవో మాట్లాడుతూ 27వ తేదీ నుండి సిబ్బంది ఇంటింటికి వచ్చి క్యాస్ట్ సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు కుల గణన పై అధికారులు సిబ్బంది విస్తత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో డిజిటల్ అసిస్టెంట్ లు నాగభూషణం, రమణ, తదితరులు పాల్గొన్నారు .

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కంకిపాడు : రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డీసీఎంఎస్ చైర్పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలోని ఆర్‌బికె కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఆర్ బి కే ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని స్పష్టం చేశారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చాట్ల విజయబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, వ్యవసాయ అధికారి పీఎం కిరణ్, వి ఏ ఏ కే పావని, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం వాడపాలెం పంచాయతి పరిధి లోని వెంకటదుర్గాంభాపురం వద్ద జీవనోపాధి కోసం పనికి వెళ్లిన తూము వెంకటేశ్వరరావుకు షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం జరిగింది. వెంటనే ప్రభుత్వం ఆసుపత్రికి తరలించినప్పటికీ మెరుగైన వైద్యం కోసం ప్రవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. మచిలీపట్నం జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్చార్జ్ బండి రామకష్ణ గురువారం ఆ కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నాపురం జనసేన నాయకులు జన్ను నాగరాజు, కాట్రం నాంచారయ్య, సాయి, ధర్మ తేజ, కోనపురెడ్డి ప్రసాద్, ఎండి సమీర్, మని బాబు, మరియు ఇతర జన సైనికులుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పుట్టగుంట దాతృత్వం అభినందనీయం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : సమాజ శ్రేయస్సుకై ఇతోధికంగా విరాళాలు అందిస్తున్న పుట్టగుంట సతీష్ కుమార్ దాతత్వం అభినందనీయమని ఆశాజ్యోతి వికలాంగుల పాఠశాల డైరెక్టర్ మరీదు మాధవీలత అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని ఆశాజ్యోతి వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సొంత నిధులతో భవనం నిర్మించేందుకు ప్రముఖ పారిశ్రామి కవేత్త పుట్టగుంట సతీష్ కుమార్ గురువారం ఉదయం భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఉద్యానవనం ఆటస్థలంలో ఈ భవనం నిర్మిం చేందుకు ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శంకుస్థాపన కార్యక్రమం అయిన మరుక్షణంలోనే యుద్ధ ప్రాతిపదికన నిర్మాణపు పనులు చేపట్టారు.హనుమాన్ జంక్షన్లోని అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద శుక్రవారం నిర్వహించబోయే భద్రాద్రి శ్రీ సీతారా మచంద్రుల కల్యాణ మహొత్సవంకి అన్నదాన, ప్రసాదాల వితరణకి పుట్టగుంట సతీష్ కుమార్ గురువారం 50వేల విరాళం దేవాలయ చైర్మన్ నెరుసు భూషణం కు అందజేశారు. ఈ కార్యక్రమాలలో సీనియర్ జర్నలిస్ట్, లయన్ తాడి రంగారావు, లయన్ చలసాని వెంకటేశ్వరరావు, లయన్ అక్కినేని రాఘువేంద్రరావు, యలమంచిలి శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన పూజ చేస్తున్న పుట్టగుంట

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎంపిపి

ప్రజాశక్తి-గన్నవరం : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ అనగాని రవి, వైయస్ఆర్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య తెలిపారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీసీతారామాంజనేయ కోఆపరేటివ్ సొసైటీలో గురువారం రైతులకు డివిడెండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షులు చిమట శ్రీనివాసరావు అధ్యక్షతన సొసైటీ సభ్యులైన 1,157 మంది రైతులకు రూ. 10.61 లక్షల డివిడెండ్ నగదును ఎంపీపీ అనగాని రవి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ...రైతు భరోసా పథకం ద్వారా ప్రభుత్వం అన్నదాతలకు ఆర్థిక తొడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. ఆర్బీకేలు ద్వారా విత్తన సరఫరా నుండి ధాన్యం కొనుగోలు వరకు అన్ని రకాలు సేవలందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, సంఘ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు నీలం ప్రవీణ్ కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ జాస్తి శేషగిరిరావు పాల్గొన్నారు.

రైతులకు డివిడెంట్లు అందజేస్తున్న రవి, తోట

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం 26 వ డివిజన్ సిసి రోడ్డు మరియు డ్రైన్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ జోనల్ ఇంచార్జి పేర్ని కష్ణా మూర్తి (కిట్టు)శంకుస్థాపన చేశారు.అనంతరం నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ సిసి రోడ్డు 20 లక్షలు, సి సీ డ్రైన్ కు 9 లక్షలు ఫిఫ్టీన్త్ ఫైనాన్స్ నుంచి మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శీలం భారతి,మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ షేక్ అచ్చాబా, మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేత

ప్రజాశక్తి -మొవ్వ : మొవ్వమండలంలోని కూచిపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లో సభ్యుడైన రైతు కైలా బాల కోటేశ్వరరావు (యద్దనపూడి) ఇటీవల మృతిచెందారు. ఆ రైతుమట్టి ఖర్చులు నిమిత్తం భార్యకు గురువారం పిఎసిఎస్ అధ్యక్షురాలు కైల శ్రీవల్లి పదివేల రూపాయలను అందజేశారు. ఈమెతో పాటు సొసైటీ సీఈవో రాజేష్ కుమార్, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు

జర్నలిస్టు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల ఆర్థిక బాధలతో ఆత్మహత్యకు పాల్పడ్డ సిటీ కేబుల్ జర్నలిస్ట్ కల్లేపల్లి చంద్ర కుటుంబానికి అవనిగడ్డ పోలీస్ సబ్ డివిజన్ అధికారి మురళీధర్ రూ 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం రాత్రి ఆయన అవనిగడ్డ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి ఎస్సై సత్యనారాయణ, ప్రెస్ క్లబ్ సభ్యులు అలపర్తి గోపాలకష్ణ, కోట సుబ్బారావు, కేయూ గ గా రిన్, సింహాద్రి జయరాం పాల్గొన్నారు.

ఎర్రంశెట్టి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : గ్రామీణ ప్రాంత ప్రజలకు యర్రంశెట్టి సేవలు అభినందనీయమని ఎంపీపీ వై.నగేష్ అన్నారు. బొమ్ములూరులో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు యర్రంశెట్టి రామాంజనేయులు పుట్టినరోజు సందర్భంగా గురువారం రామాం జనేయులుతో కలిసి మహిళలకు చీరలు, పేదలకు దుప్పట్లు, పంపిణీ చేసారు.మేరీమాత ఆలయంలో పుట్టినరోజు సందర్భంగా యర్రంశెట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైవీఆర్ యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ ను ఆయన కట్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన బీరువాలు, వంటసామాగ్రి అందజేశారు. అనంతరం హనుమాన్ జంక్షన్ లోని ఆంజనేయ స్వామి ఆలయంలో యర్రంశెట్టి ప్రత్యేక పూజలు నిరించారు. నాటక రంగ అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, కొమ్మా కోట్లు, ఎంపీపీ యరగొర్ల నగేష్, అనగాని రవి, తోట వెంకయ్య పాల్గొన్నారు.

జనసేనకు ఆర్‌కె రాజీనామా

ప్రజాశక్తి - గుడివాడ : పార్టీ యువ నేత డాక్టర్ మాచర్ల రామకష్ణ (జనసేన ఆర్కె) తన అనుచర గణంతో కలిసి జనసేన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పదిమందికి మేలు చేసే వ్యక్తులకు మద్దతు ఇస్తానని, గుడివాడ ప్రజలకు మంచి జరగడమే తన అంతిమ లక్ష్యమన్నారు. గుడివాడలో జనసేన నేతలు గ్రూపులుగా విడిపోయి వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యమి స్తున్నారన్నారు. జిల్లా నేతల వ్యవహార శైలి నచ్చక పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామని, గుడివాడలో జనసేన కార్యకర్త కావడమే తాము చేసుకున్నా దౌర్భాగ్యమా అని ప్రశ్నించారు. ఆయనతో పాటు జనసేన యువ నేతలు అయ్యప్ప, చరణ్‌లు కూడా రాజీనామా చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఆర్కే

పూర్వవిద్యార్థుల సంబంధాల అధికారిగా శ్రావణి నియామకం

ప్రజాశక్తి -మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వ విద్యాలయ పూర్వ విద్యార్థుల సంబంధాల అధికారి గా మేనేజ్మెంట్ విభాగం సహాయ ఆచార్యులు డా. ఎం శ్రావణి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఉప కులపతి ఆచార్య జి జ్ఞానమణి ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయంలో చదువు పూర్తయి వివిధ స్థాయిల్లో, ప్రాంతాల్లో, దేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల వివరాలు సేకరించి వారి తోడ్పాటు ను విశ్వవిద్యాలయం కు అందించేలా విధులు నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రారు డా.వీర బ్రహ్మాచారి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శ్రావణి కి అభినందనలు తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -మొవ్వ : మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో సత్యసాయి సేవా సమితి (మొవ్వ) ఆధ్వర్యంలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. గురువారం సాయిబాబా 98వ జయంతి వేడుకలు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కూచిపూడి లో సోమయాజులు మురళీకష్ణ శర్మ ఆధ్వర్యంలో ఎంపీ ఎలిమెంటరీ (రెగ్యులర్) పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పెదపూడి సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

దుర్గమ్మ దేవాలయానికి విచ్చేసిన అండర్-19 భారత్ బృంద సభ్యులు

దుర్గమ్మను దర్శించుకున్న అండర్ 19 భారత క్రికెట్ బృందం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను అండర్ -19 భారత్ క్రికెట్ బందం శ్రీ అమ్మవారి దర్శనార్థం గురువారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్.రామరావు, పాలకమండలి వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా కార్యనిర్వాహనాధికారి వారు, ట్రస్ట్ బోర్డు సభ్యులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డ్ సభ్యులు బుద్ధా రాంబాబు, కట్టా సత్తయ్య, చింకా శ్రీనివాసులు, బచ్చు మాధవీ కష్ణ, సహాయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న కార్మిక మంత్రి గుమ్మనూరు జయరాం

జయరాంకు స్వాగతం పలుకుతున్న ఇఒ రామారావు

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్ వలవెన్ శ్రీ అమ్మవారి దర్శనార్థం గురువారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనము చేయగా కార్యనిర్వాహణాధికారి వారు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయాలని వినతి

వినతిపత్రం అందచేస్తున్న పోతిన మహేష్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజక వర్గం ముసాయిదా ఓటర్ల జాబితాలో అనేక తప్పులు పొరపాట్లు ఉన్నాయని, వీటన్నిటిని తొలగించి ఖచ్చితమైన తుది ఓటర్ల జాబితా విడుదల చేయాలని చీఫ్ ఎలెక్ట్రోల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్‌మీనాని సెక్రటేరియట్లో కలిసి జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్ ఫిర్యాదు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొట్నూరి శ్రీనివాసరావు, షేక్ అమీర్ భాషా పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో మరణించిన వారివి, నివాసం మార్పు చెందిన వారివి, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు, మూడు ఓట్లు, నాలుగు ఓట్లు తొలగించనవి, డిజిటల్ డోర్ నెంబర్లు సరైన పాత డోర్ నెంబర్ల సమాచారం పొందుపరిచి, ఫొటో ఉన్నా సమాచారం లేని ఓటర్ల యొక్క పూర్తి సమాచారం పొందుపరిచనవి, ఒకే డోర్ నెంబర్లు 20 ఓట్లు 30 ఓట్లు ఉన్న ఇళ్లను పూర్తిస్థాయిలో మరొకసారి పరిశీలించాలని ఫిర్యాదులో కోరారు. ముఖేష్ కుమార్ మీనా స్పందిస్తూ ఓటర్ల జాబితాను సరి చేస్తామని మహేష్‌కు హామీ ఇచ్చారు.

వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గంపలగూడెం : సత్యసాయి బాబా 98వ జయంతిని పురస్కరించుకొని 125 మంది వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు అంద జేశారు. సత్య సాయి బాబా యాత్రిక బృందం ప్రతినిధి చారుగుండ్ల కృష్ణారావు గురువారం సాయంత్రం తన స్వగహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఘనంగా భజన కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

35వ డివిజన్లో వెలంపల్లి పర్యటన

స్థానిక మహిళల సమస్యలను తెలుసుకుంటున్న ఎంఎల్ఎ వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 35వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గురువారం పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకొన్నారు. డివిజన్‌లో జరగాల్సిన అభివద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ డివిజన్ అభివద్ధి కొరకు అధికారులతో కలిసి పర్యటించామన్నారు. నియోజకవర్గ అభివద్ధి పరచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్వామీ వివేకానంద, పోలిమెట్ల శరత్, సంగీత్ బాబు, బసవ రాజు, శివ, బద్రి, బాల, మేరీ, బ్యూలరాణి, శ్యామ్, నాగరాజు, ఫిలోమన్ తదితర పార్టీ నాయకులు. సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కెయు ఆచార్య బసవేశ్వరరావు

ప్రసంగిస్తున్న ఆచార్య బసవేశ్వరరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నూతన రంగాల్లో తమకు ఎదురైన అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ముందుకు సాగాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'రసాయనశాస్త్రంలో అర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ పాత్ర, ప్రస్తుత ప్రగతి, రానున్న పరిస్థితులు' అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభకు ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రసాయనశాస్త్రం చాలా సమాజ వికాసానికి, మనుగడకు చాలా కీలకమైనదన్నారు. నేడు ముందుకు వచ్చిన అర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ ద్వారా రసాయనశాస్త్రంలో మరిన్ని ఆవిష్కరణలు వచ్చినట్లయితే సమాజానికి మరింత మేలు జరుగుతుందన్నారు. ఔషధ తయారీ, నిర్ధారణ, సమాచార విశ్లేషణ తదితర అంశాల్లో అర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ పాత్ర పెరగటం వలన ప్రజలకు మరింత త్వరతగతిన ఫలితాలు అందుతాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను, నూతన ఆవిష్కరణలను తెలిపేందుకు నిరంతరం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఐసిటి (హైదరాబాద్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే సురేష్‌బాబు, విట్ విశ్వవిద్యాలయం ఏపీ రసాయనశాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ బీ బందుమజుమదార్, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ వీఎస్ బస్వంత్ ఓరుగంటి, రవ్వ మహేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ కష్ణవేణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, అధ్యాపకులు డాక్టర్ కిరణ్‌కుమార్, కేపీటీ విజయభాస్కర్, ఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరులోని ఆస్టర్ రమేశ్ అమరావతి ఆసుపత్రిలో ఈనెల 25వ తేదీ ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రముఖ కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ గుడారు జగదీష్, మాజీ డైరెక్టర్, తిరుపతి బర్డ్ ఆసుపత్రి వారిచే పుట్టుకతో వచ్చిన అంగవైకల్య సమస్యలు, విరిగిన ఎముకలకు, మోకీలు, తుంటి, భుజం, మోచేయి, కీళ్ల మార్పిడి, ఆర్థోస్కోపి, రివిజన్ ఆపరేషన్స్, వెన్నెముక చికిత్సలు, మొదలగు వ్యాధులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మేనేజ్మెంట్ కోనేరు కృష్ణ తెలిపారు. అపాయింట్‌కు 79970 36777 నెంబరును సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్

పున్నమి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కె.వి. నేతాజీ ఫీడర్ విద్యుత్తు లైన్ మరమ్మత్తుల కారణంగా ఈనెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు పోస్ట్ ఆఫీస్ రోడ్డు, బుద్ధా వారి వీధి, అండమాను బ్రహ్మయ్య వీధి, లొల్లా వారి వీధి, కామకోటినగర్, అరవిందా స్ట్రీట్, కె.సి స్కూల్ రోడ్డు, సిమెంటు రోడ్డు తదితర ప్రదేశాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని కార్యనిర్వాహక ఇంజనీర్ విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించవలసినదిగా కోరారు.

మహాధర్నా పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈనెల 27, 28 తేదీలలో గాంధీనగర్ జింఖానా గ్రౌండ్‌లో కార్మిక, కర్షక మహా ధర్నాను ఆశా కార్యకర్తలు జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎ.కమల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం పశ్చిమ నియోజక వర్గంలోని కొత్తపేటలో గల మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్‌లో ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. టి.హవీల కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎ.కమల, సి.ఐ.టి.యు నగర కార్యదర్శి ఈ.వి.నారాయణ తదితరులు పాల్గొని మహాధర్నా పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలపై పనిభారం పెంచి, రాజకీయ వేధింపులకు ప్రభుత్వం గురిచేస్తుందన్నారు. జీవితమంతా చాకిరీ చేసినా ఎటువంటి లబ్ధి అందక అన్యాయం జరుగుతున్నా ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయకపోవటాన్ని తప్పు పట్టారు. వీటిని సాధించేందుకు మహాధర్నా జరుగుతుందని, ప్రభుత్వం స్పందించాలని లేకుంటే డిసెంబర్ 11, 12 తేదీల్లో మరో పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామాలలో రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దంతాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్యదర్శి సంఘం మండల కార్యదర్శి కోటా కష్ణ, రైతులు కాకనబోయిన రోశాలు, తదితరులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** కార్మిక, రైతు యావత్తు ప్రజా వ్యతిరేక విధానాలపై నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు కంచికచర్ల కార్యదర్శి బెజ్జం భూషణం పిలుపునిచ్చారు. కంచికచర్లలో గురువారం ధర్నా కరపత్రాలు ఆవిష్కరణ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. **చందర్లపాడు :** మండలంలోని కొండపేట, కొడవటికల్లు, పున్నవల్లి, కొత్తపాలెం తదితర గ్రామాల్లో రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.విఆంజనేయులు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షుడు గుమ్మళ్ళ ఏడుకొండలు, కార్యదర్శి సందిపోగు లింగయ్య, సిఐటియు నాయకులు తోట రామారావు, నాగినేని వెంకట రామారావు, జంపాని నరేష్, జంపాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి ఇండస్ట్రియల్ ప్రాంతంలో హెచ్‌పి గ్యాస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. సిఐటియు మండల కార్యదర్శి మహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు బాబూరావు నాయక్ ఆర్‌వి.ప్రసాద్, బాలాజీ హాను శ్రీను పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో...

చందర్లపాడులో...

జగ్గయ్యపేటలో...

ఇబ్రహీంపట్నంలో...

కంచికచర్లలో...

మురుగు పారదు...యంత్రాంగం కదలదు...

- బండారుగూడెంలో పారని డ్రైనేజీలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :ఆ పంచా యతీ అధికారులు పాలక పక్షం నిర్లక్ష్యం పంచాయతీ ప్రజలకు శాపంగా మారింది.డ్రైనేజ్ లు కంపు కొడుతున్నా చోద్యం చూస్తారే తప్ప డ్రైనేజీలో మురికి నీరు పారించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామంలో గత కొంతకాలంగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో వీధుల్లో కాలువలు పూడికలు పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుందని ఇంటి దగ్గర ఉన్నప్పుడు కనీసం భోజనం కూడా చేయలేకపోతున్నామని రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో తమ గ్రామం వైపు చూడటం లేదని స్థానికులు వాపోయారు. వర్షం కురిసినప్పుడు నీరు మళ్లిపోయేందుకు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో చినుకు రాలితే చాలు రోడ్డంతా జలమయమై,కోతకు గురౌతోందని మురుగు,వర్షం నీరు ఇళ్లల్లోకి చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా ఇదే సమస్యలతో బాధపడుతున్నామని ముఖ్యంగా మురుగు, వర్షపు నీరును పోవడానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక, రహదారులు కోతకు గురి కావడంతో పాటు, గ్రామ మంతా నీటితో నిండి చిత్తడిమారుతున్నా సమస్యకు కారణమైన కాలువలు ఏర్పాటుపై అధికారులు, నాయకులు దష్టి పెట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. పంచాయతీకి ఆదాయం ఉన్నా అభివద్ధి శూన్యం అని బండారుగూడెం పంచాయతీకి అభివృద్ధి చేపట్టడం లేదని పారిశు ధ్యలోపం వల్ల వర్షం నీరు మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో విపరీతమైన దోమలు వ్యాప్తి చెందుతున్నాయి విష జ్వరాలు సంభవించే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వైరల్ ఫీవర్ తో ఇప్పటికే గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొత్త రోగాలు ఏం వస్తాయో అని గ్రామస్తులు భయపడుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

మురుగు నీటిలో నడుస్తున్న స్థానికులు

డ్రైనేజీలో సాగని మురుగు నీరు

కెడిసిసిబి సేవలను సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్

ప్రజాశక్తి-చల్లపల్లి : రైతులు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని మంగళా పురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు అన్నారు. గురువారం చల్లపల్లి మండలం మంగళాపురం పీఏసీఎస్ వద్ద కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో సొసైటీ ఛైర్మన్ పేరం నాగిరెడ్డి పర్యవేక్షణలో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రజలకు కేడీసీసీ బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, ప్రతి ఒక్కరు కూడా పొదుపు ఖాతా తెరవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగి కుందుర్తి కమలాకరరావు, సొసైటీ పర్సన్ కాళింగి ఆది లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీపురం సొసైటీలో కళా ప్రదర్శన నిర్వహించారు. లక్ష్మీపురంలో సొసైటీ ఛైర్మన్, వైసీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్య నారాయణ (నానీ), సీఈఓ లంకపల్లి రమేష్ పర్యవేక్షించారు.

26న రజకుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - గుడివాడ : ఈనెల 26వ తేదీన రజకుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని నైనావరపు శేషుబాబు అన్నారు. గురువారం కమ్మవారి కళ్యాణ మండపం నందు విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల ఆత్మగౌరవ సభ ఆదివారం లక్ష మందితో నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా భారీగా బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దుకాణాల బహిరంగ వేలాన్ని నిలుపుదల చేయాలని వినతి

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగ వేలం పాట నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ పివి రావు మాల మహానాడు ఉమ్మడి కష్ణాజిల్లా అధ్యక్షుడు పంతగాని సురేష్ గుడివాడ మున్సిపల్ కమిషనర్ మురళీకష్ణ, ఆర్డీవో కార్యాలయ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం వ్యాపార ధోరణితో ఆలోచిస్తున్న ఎన్టీఆర్ స్టేడియం కమిటీ క్రీడాకారులను ప్రోత్సహించడం మాని షాపింగ్ కాంప్లెక్స్ లో నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా మాల మహానాడు నాయకులు రేమల్లి రమేష్, చాగంటి పాటి చంటి, అబ్బూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బంది ఉన్న పరిష్కరించేందుకు ఏర్పాటుచేసిన కంట్రోల్ విభాగం సమర్ధవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లో సంయుక్త కలెక్టర్ ఛాంబర్ వద్ద ధాన్యం సేకరణలో వచ్చే సమస్యలను అధిగమించేందుకు ఏర్పాటుచేసిన కంట్రోల్ విభాగాన్ని తనిఖీ చేసి పనితీరు పరిశీలించారు. తొలుత పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీధర్ కంట్రోల్ విభాగం పనితీరును వివరిస్తూ కంట్రోల్ విభాగము ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని, ఎవరైనా సరే విభాగంలో ఏర్పాటుచేసిన 96520 14457 సెల్ ఫోన్ నెంబర్కు గాని లేదా సంయుక్త కలెక్టర్ కార్యాలయం ల్యాండ్ లైన్ నెంబర్ 08672 252601 కు గాని ఫోన్ చేసి ధాన్యం సేకరణలో ఉన్న సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ఫోన్లో స్వీకరించిన సమస్య వివరాలను ఫిర్యాదు రిజిస్టర్లో నమోదు చేయడంతో పాటు, సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీధర్ కలెక్టర్ కు వివరించారు. ఇప్పటివరకు మూడు ఫిర్యాదులు అందాయని వాటిని పరిష్కరించామని కలెక్టర్ కు చెప్పారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట సంయుక్త కలెక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ ఓ పెద్ది రోజా, కలెక్టరేట్ ఏవో రాధిక, కంట్రోల్ విభాగం పర్యవేక్షకులు సులోచన తదితర అధికారులు పాల్గొన్నారు.

27న 'దళిత శంఖారావం'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 27 జరిగే విజయవాడలో జరగనున్న దళిత శంఖారావంను విజయ వంతం చేయాలని కృష్ణాజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ పిలుపు నిచ్చారు. గురు వారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం దళితులపై చేస్తున్న దమనకాండకు,దళితులకు రావాల్సిన సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించినందుకు నిరసనగా లి"దళిత శంఖారావం"ను ఉమ్మడి కష్ణా జిల్లా అధ్వర్యంలో ఈ నెల 27 న విజయవాడ బెంచ్ సర్కిల్ వద్ద గల లారీ ఓనర్స్ అసోసియేషన్ కన్వక్షన్ నందు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. గుంటూరు వెంకటరత్నం ఎస్ టి సెల్ ప్రధాన కార్యదర్శి కష్ణ పామర్రు నియోజవర్గ అధ్యక్షుడు చిలి. ప్రసన్న కుమార్, షోలే శ్రీనివాసరావు ,కొమ్ము . సుందర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో రెట్టింపు నమ్మకం : విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్రంలో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరిసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 60 వ డివిజన్ వాంబేకాలనీ డి బ్లాక్ లోని 264 వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైసీపీ డివిజన్ అధ్యక్షులు బత్తుల దుర్గారావు, డివిజన్ ఇంచార్జి బెవర నారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. మొదట మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఘన నివాళులర్పించి.. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయంలో సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమై ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు విమర్శించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను ఎలా కత్తిరించాలా అని చంద్రబాబు సర్కారు ఆలోచన చేస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. 264 వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా 12 కోట్ల 65 లక్షల 6 వేల 754 రూపాయల మేలు చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా 8 కోట్ల 31 లక్షల 34 వేల 677 రూపాయలు.. మొత్తంగా 20 కోట్ల 96 లక్షల 41 వేల 431 రూపాయల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. అలాగే ఈ ప్రభుత్వంలో అభివద్ధి నిరంతరం ప్రక్రియగా కొనసా గుతున్నట్లు తెలియజేశారు. నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గహ సారథులు పాల్గొన్నారు.

బట్టలు పంపిణీ చేస్తున్న గోపిశెట్టి

మానసిక వికలాంగులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : వైసీపీ యువ నాయకులు యర్రం శెట్టి రామాంజనేయులు పుట్టినరోజు సందర్భంగా గురువారం దావాజీ గూడెంలోని మానసిక వికలాంగుల కేంద్రంలో కాపు ఐక్య సమ్మే ళనం నాయకులు గోపిశెట్టి వీరాస్వామి ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. పండ్లు, స్వీట్స్ పంచారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని, వైసీపీ నాయకులు నక్కా బుజ్జి, మనసి క వికలాంగుల కేంద్రం నిర్వాహకులు వెంకట్, రజిత పాల్గొన్నారు.

స్టేడియం చుట్టూ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం చుట్టూ ఉన్న రోడ్డు నిర్మాణం చేపట్టా లని సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. గుడివాడ సిపిఎం కార్యాలయంలో గురు వారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అర్ సి పి రెడ్డి మాట్లాడుతూ గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం ఆటలకి పుట్టినిల్లుగాను, ఉల్లాసాన్ని కల్పించడానికి ఆనాడు ఎన్టీ రామారావు ఆధ్వర్యంలో స్టేడియం నిర్మాణం చేపట్టారన్నారు. స్టేడియం చుట్టూ ఉన్న రోడ్డు చాలా పాడైపోయింది కాబట్టి ఆ రోడ్డుని కొత్త రోడ్డుగా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. రోజూ వందలమంది స్టేడియంలోకి వాకింగ్ కి వాకింగ్ ట్రాక్ లో స్టేడియం చుట్టూ తిరుగుతారు కాబట్టి ఆ రోడ్డుని నిర్మిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ కమిటీ సభ్యులు పి రజిని, సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీకష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సిపి రెడ్డి

గెలుపొందిన క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి-చల్లపల్లి : విద్యార్థిని విద్యార్థులు చదువులో రాణిం చేందుకు మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పొందెందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని విజయ క్రాంతి కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ 2023-2024 నవంబర్లో నిర్వహించిన గేమ్స్ లో గెలుపొందిన విద్యార్థులను గురువారం కార్యాలయ ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ క్రాంతి జూనియర్ కాలేజ్ లో విద్యార్థి చింతల మహేంద్ర (ఫస్ట్ ఇంటర్) ఇంటర్ నెట్ బాల్ లో కష్ణా జిల్లా జట్టులో ఆడి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించగా . జనుముల ప్రమోద్ కుమార్(సెకండ్ ఇంటర్) సాఫ్ట్ బాల్ లో కష్ణా జిల్లా జట్టు లో ఆడి తతీయ స్థానంలో నిలిచి బ్రౌన్ మెడల్ సాధించారని. తెలిపారు. విజేతలను పిఈటి ప్రేమ్ బాబు, ఇతర అధ్యాపక బందం వారిని ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బ్యాడ్మింటన్ జాతీయ టోర్నీ నిర్వహణకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : డిసెంబర్ 12 నుంచి 16 వరకు విజయవాడలో జరిగే ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 బ్యాడ్మింటన్ జాతీయ టోర్నమెంటును విజయవంతం చేయాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు కలెక్టర్ డిల్లీరావును కలిసి టోర్నీ విశేషాలను వివరించారు. అండర్-19 బాలురు, బాలికల కేటగిరీల్లో పోటీలు జరగనున్నట్లు తెలిపారు. సిద్దార్ధ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభవేడుకలు జరుగుతాయని, అలాగే సీఆర్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో పోటీలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివద్ధికి కషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను యువ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టోర్నీ కన్వీనర్ సి.శివ సత్యనారాయణరెడ్డి, స్టేట్ అండర్-19 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భానుమూర్తిరాజు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికాంత, సిద్దార్ధ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ నారాయణరావు తదితరులు ఉన్నారు.

జ్యోతి సురేఖ ప్రతిభ జిల్లాకు గర్వకారణం : డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : వెన్నం జ్యోతి సురేఖ ప్రతిభ జిల్లాతోపాటు దేశానికి గర్వకారణమని, వివిధ అంతర్జాతీయ టోర్నమెంట్లలో ఆమె పతకాలు సాధిస్తుండటం అభినందనీయమని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో మూడు బంగారు పతకాలు, బ్యాంకాక్‌లో నవంబర్ 3 నుంచి 10 వరకు జరిగిన 23వ ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత రజతం, టీమ్ స్వర్ణ పతకాన్ని జ్యోతి సురేఖ సొంతం చేసుకుని దేశానికి, రాష్ట్రానికి, జిల్లాలకు గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. కలెక్టర్ కార్యాలయం లో అంతర్జాతీయ ఆర్చర్, డిప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ గురువారం కలెక్టర్ డిల్లీరావును మర్యాద పూర్వకంగా కలిశారు. జ్యోతి సురేఖను కలెక్టర్ ప్రత్యేకం గా అభినందించారు.

జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కృషి

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 724 మందికి రూ.6.04 కోట్లు జమ

విజయవాడలో చెక్కు అందిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచి ఆర్థిక అసమానతలు తొలగించే లక్ష్యంతో దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలుచేస్తోందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. పేద తల్లితండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఆపై వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించే లక్ష్యంతోనే వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల కింద 2023 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన జంటలకు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా విజయవాడలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, మచిలీపట్నంలోని జిల్లా జాయింట్ కలెక్టరేట్ నుండి కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు ఎన్‌టిఆర్ జిల్లాలో కళ్యాణమస్తు, షాదీ తోఫా 4వ విడత 372 మంది లబ్ధిదారులకు రూ.3.25 కోట్ల మెగా చెక్‌ను, జెసి అపరాజిత సింగ్ కృష్ణాజిల్లాకు చెందిన 352 జంటలకు రూ.2.79 కోట్ల మెగా నమూనా చెక్కులను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా విజయవాడ నుండి కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఈఏడాది నాలుగో విడతలో 372 మంది వధూవరులకు లబ్ధి చేకూర్చామని, వీరిలో బీసీలు 157 మంది, ఓసీలు నలుగురు, ఎస్సీలు 181 మంది, ఎస్‌టీలు 30 మంది ఉన్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో విజయవాడ పశ్చిమ, తిరువూరు శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ రక్షణనిధి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.విజయభారతి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండి శివశక్తి పుణ్యశీల, స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్, ఏపీ పౌర సరఫరాల డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య పాల్గొన్నారు.

మచిలీపట్నంలో చెక్కు అందిస్తున్న జెసి అపరాజిత సింగ్

అప్పులపాలు కాకుండా కళ్యాణమస్తు అమలు : అపరాజిత సింగ్

మచిలీపట్నంలోని జెసి కార్యాలయం నుండి జిల్లా జాయింట్ కలెక్టర్లో జెసి అపరాజిత సింగ్ మాట్లాడుతూ ఈ పథకాల కింద జిల్లాలో మొదటి 3 విడతల్లో 1290 జంటలకు రూ.10.17 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. నాల్గవ విడతతో కలిపి మొత్తం (4 విడతల్లో) 1642 జంటలకు రూ.12.97 కోట్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మేయర్ చిటికెన వెంకటేశ్వర్లు, డిప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ షేక్ సిలార్ దాదా, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి షాహిద్ బాబు, డిఆర్డిఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజేంద్ర బాబు పాల్గొన్నారు.

భవానీ దీక్షల మాలాధారణ ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గగుడిలో గురువారం కార్తీకశుద్ధ ఏకాదశి రోజున భవానీ మండల దీక్షా కార్యక్రమం (మాలాధారాణ) ప్రారంభమైంది. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ, ప్రధానార్చకులు, వైదిక కమిటీ సభ్యుల వారి ఆధ్వర్యంలో ఆలయ ఇఒ కేఎస్ రామరావుతో దుర్గమ్మ ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా భవానీ దీక్షా మండపానికి తీసుకొని వచ్చి, గణపతి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉప ప్రధానార్చకులు వై.నాగరాజు శాస్త్రి మండల దీక్షా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమం ఈనెల 27 తేదీ వరకు (కార్తీక శుద్ధ పౌర్ణమి వరకు) నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే డిసెంబర్ 13 నుండి 17వ తేదీ వరకు అర్ధమండల దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 26వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి సత్యనారాయణపురంలోని శివరామ కష్ణ క్షేత్రం నుండి కలశ జ్యోతి ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 3 నుండి 7వ తేదీ వరకు (ఇరుముడి, అగ్నికుండములు ప్రారంభం) మాలా విరమణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 7వ తేదీ ఉదయం మహా పూర్ణాహుతి కార్యక్రమంతో భవానీ దీక్షల కార్యక్రమం పరి సమాప్తి అవుతుందని ఇఒ రామారావు తెలిపారు.

25న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, స్కిల్ డెవలప్మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లోని నిరుద్యోగులకు ఈనెల 25వ తేదీన విజయవాడలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. హ్యుమన్ ఫస్ట్,టీమ్ లీస్, మెడ్ప్లస్,హిటిరో ల్యాబ్స్, జెన్యూస్ సెక్యూరిటీ సర్వీసెస్, టాటా ఎలక్ట్రానిక్, మ్యాట్రి హ్యూమన్ సోర్స్ ప్రైవేట్,నవతా ట్రాన్స్పోర్ట్, శ్రీ సుధీర్ టింబర్ ప్రైవేట్, హైటెక్ ప్రింటింగ్ కంపెనీల్లో నియామకాలుంటాయని తెలిపారు. అభ్యర్థులు www.ncs.gov.in వెబ్సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని, వివరాలకు 8142416211లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, NISAR AHMED, (Old Name), S/o. Mohammad Zafeer Alam, Resident of D.No.1-2-13, Kuteti Kotayya Veedhi, Kummaripalem, Vidyadharapuram, Vijayawada - 520012. My Name has been changed to **MOHAMMAD NISAR AHMED (New Name).** Here after my name is known as **MOHAMMAD NISAR AHMED.**

CHANGE OF NAME

I, **MUKKMALA SRINIVASA CHAKRAVARTHI GUPTA** (Old Name), S/o. **MUKKAMALA VENKATESWARA RAO** resident of D.No. 27-17- 74/11, Pedda Botla Vari Street, Governerpeta, Vijayawada-520002 ,Andhra Pradesh, INDIA,. I have changed my name from **MUKKMALA SRINIVASA CHAKRAVARTHI GUPTA** (Old Name) to **MUKKAMALA SRINIVASA CHAKRAVARTHI GUPTA** (NEW NAME). Hereafter be called, known as **MUKKAMALA SRINIVASA CHAKRAVARTHI GUPTA.**

CORRECTION IN FATHER NAME

I, **KOMMULA KOWSHIK** S/o **KOMMULA GANGADHAR** (Old name) resident of D.No. 75-12-42A, NH Road, Bhavanipuram, Vijayawada - 520012, A.P. India have change my name as **KOMMULA KOWSHIK** S/o **KOMMULA GANGADHAR** (Old name) to **KOMMULA KOWSHIK** S/o **KOMMULA GANGADHAR RAO** (New name). Hereafter my name is known as **KOMMULA KOWSHIK** S/o **KOMMULA GANGADHAR RAO** (New name)

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **గింజుపల్లి వెంకటేశ్వర్లు,** తండ్రి : గింజుపల్లి పున్నయ్య, **నివాసం :** ఇ.నెం. 1-60, ముచ్చింతాల గ్రామం, పెనుగంచిప్రోలు మండలం, కృష్ణా జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించు కున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 7రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి :

కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట సబ్ డి|| పెనుగంచిప్రోలు మండలం, ముచ్చింతాల గ్రామపంచాయితీ లిమిట్స్‌లో ఉండబడిన ముచ్చింతాల గ్రామవ గ్రామకంఠం ఆర్‌యస్ నెం. 183 రు దాఖలా మ. 15-84 సెంట్లు మింజుమలే య.0-15 సెంట్లు లేక 726 చ||గ||ల స్థలంలో**డాక్యుమెంట్ నెంబర్ :** 2313/2018 ఇందులో గల డోర్ నెం. 1-60 రు ఆర్‌సిసి డాబా ఇల్లు అసెస్‌మెంట్ నెం.59 కరెంట్ మీటరు నెం. 42 కలప కప్పు, తలుపులు, కరెంటు వైరు ఫిటింగ్ వగైరాలతో సహా హద్దులు : **తూర్పు :** రోడ్డు, **దక్షిణము :** పొన్నం సత్యనారాయణ గారి ఇల్లు, **పడమర :** నా తాలూకు (గింజుపల్లి పున్నయ్య) మిగతా భూమి, **ఉత్తరం :**నా తాలూకు (గింజుపల్లి పున్నయ్య) మిగతా భూమి.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం., సెల్ : 9848022542

మొదటిపేజీ తరువాయి

రైల్వేల ప్రైవేటీకరణను నిలిపేయాలి

విజయనగరం జిల్లాలో కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదాలు తార్కాణం అన్నారు. ఈ ధర్నాలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ జోన్ కార్యదర్శి జివి, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఎ.కమల, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇవి నారాయణ, వై.ఆదిలక్ష్మి, టి.ప్రభుదాసు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో ధర్నా

రైల్వేల ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని సిఐటియు కృష్ణాజిల్లా నాయకులు బూర సుబ్రహ్మణ్యం కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రైల్వేల ప్రైవేటీకరణను నిరసిస్తూ గురువారం మచిలీపట్నం రైల్వేస్టేషన్ వద్ద రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ మచిలీపట్నం కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మన రాష్ట్రంలో వేలాదిమంది రైల్వే గూడ్స్ షెడ్లలో లోడింగ్, అన్లోడింగ్ హమాలీ కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారని, రైల్వేలకు సరుకుల రవాణా ద్వారా వేల కోట్ల ఆదాయం సమకూరుతోందని అన్నారు. ఇంతటి ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న గూడ్స్ షెడ్ హమాలీ కార్మికులకు ఏ విధమైన చట్టపరమైన హక్కులు, సౌకర్యాలు లేవని అన్నారు. పని ప్రదేశంలో తగిన విశ్రాంతి గదులు, మంచినీటి సౌకర్యం లేదన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం, రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలని, ఇఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నేతలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మచిలీపట్నం రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మచిలీపట్నం మండల కార్యదర్శి సిహెచ్.జయరావు, మచిలీపట్నం రైల్వేగూడ్స్ షెడ్ ముఠా కార్మికుల యూనియన్ అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి పి.యేసు, యూనియన్ నాయకులు దుర్గారావు, ఏడుకొండలు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి అభివృద్ధికి శ్రీకారం

మునిసిపల్ స్టేడియంలో మేలో జరిగిన మహాయజ్ఞం అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రితో దీనికి ఆమోద ముద్ర వేయించుకున్నట్లు సమాచారం. ఇది వరకు రూపొందించిన ప్లాన్‌లోను, నమూనాలు, వాటి నిర్మాణ ప్రాంతాల విషయాల్లోను లోపాలున్నాయని, అందుకే మాస్టర్ ప్లాన్‌ను పక్కన పెట్టి నూతనంగా ప్లాన్‌ను రూపొందించినట్లు సిఎంకి మంత్రి కొట్టు వివరించినట్లు తెలిసింది. మరో వైపు మాజీ మంత్రి వెలంపల్లికి, ప్రస్తుత మంత్రికి కొట్టు సత్యనారాయణకు మధ్య విభేదాలు తలెత్తాయని, ఆ కారణంగానే పాత ప్లాన్‌ను పక్కన పెట్టి కొత్త దానికి తెరతీశారని అధికార పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత

చెబుతున్నారు. పాఠశాలల్లో ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయుల్లో 280 మందికిపైగా పీజీటీలు హైస్కూల్ ప్లస్ పాఠశాలలకు వెళ్లిపోయారు. ఇంకొందరు ఎంఈఓలుగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించలేదు. ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదు. సుమారు ఐదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదు. ఉపాధ్యాయుల సర్దుబాట్లతో సమస్య పరిష్కారం కాలేదు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల ఏడాది పొడవునా.. బదిలీలు, సర్దుబాట్లు చేటుచేసుకుంటున్నాయి. దీంతో ఏ ఉపాధ్యాయుడు ఎక్కడ ఎంతకాలం స్థిరంగా ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఖాళీ పోస్టులకు సంబంధించిన పాఠ్యాంశాల సిలబస్ బోధనకు ఎవరిని సర్దుబాటు చేస్తారో, సిలబస్ ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాలు రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలపై ప్రభావం చూపుతుం దని పాఠశాలల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో హైస్కూళ్లలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

NIMRA COLLEGE OF NURSING
(Approved by APNMC/ INC & Affiliated to Dr YSRUHS)
Nimra Nagar, Jupudi, Ibrahimpatnam, Vijayawada, NTR Dist-521456.
Ph: 0866-2881911, e-mail: principalnmcn@gmail.com, Visit Us :www.nimra.in

ADMISSION NOTIFICATION - 2023-2024 FOR MANAGEMENT QUOTA UNDER "B" CATEGORY SEATS in B.Sc. (Nursing) 4YDC

NIMRA COLLEGE OF NURSING (NMCN): B.Sc. (Nursing) 4 YDC: 16 Seats

Applications can obtain from Office/ website (**www.nimra.in**) and submit the Filled in Applications for Admission into **I Year B. Sc (Nursing) 4 Year Degree Course** for the Academic Year 2023-24 to the undersigned along with Cash/ DD for **Rs.200/-** in favor of **NIMRA EDUCATIONAL SOCIETY** towards Cost of Application cum Registration on or before **29-11-2023 by 11.00 am.**
First Merit List: **29-11-2023** at **2.00 pm.**

SPOT ADMISSION NOTIFICATION UNDER CONVENER QUOTA FOR VACANT SEATS

The Eligible and Interested Candidates are requested to attend Spot Admission Counseling at our College for Convener Quota (**Category-A**) for Leftover/ Vacant Seats due to not reporting for Admission into **I Year B. Sc (Nursing) 4 Year Degree Course** for the Academic Year 2023-24 on **29-11-2023** at **2.00 pm** as per the guidelines of APSCHE/ APNMC/INC/DR.YSRUHS.
Note: Eligibility Criteria for Admission as per the Guidelines of APSCHE/ Govt. of AP / Dr.YSRUHS/APNMC/ INC.
Selected Candidates should pay the **Annual Tuition fees: Rs. 19,000/-** plus **Special fees** on or before **30-11-2023** at the College Office. No Fees reimbursement

Place: Jupudi,
Date: 23-11-2023

Sd/-
DIRECTOR - Admissions 2023-24

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రజలందరికీ సుపరిపాలన అందిస్తున్నది సీఎం జగన్మోహన్రెడ్డి మాత్రమేనని, సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండల పరిధిలోని శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం లంక భూముల లీజు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని సాహసం వైసీపీ ప్రభుత్వం చేసిందన్నారు. ఎంతో కాలంగా ఉన్న లంక భూములకు పట్టాలు అందించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మండలంలోని గోగినేనిపాలెం, పాపవినాశనం, తెలుగు రావుపాలెం, శ్రీకాకుళం గ్రామ పరిధిలోని లంక భూములకు సంబంధించి 753 మంది రైతులకు లీజు పట్టాలు పంపిణీ చేశారు. 433 ఎకరాలు సంబంధించి రెవెన్యూ సిబ్బంది ఎంతగానో శ్రమించి ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో మహత్తర కార్యక్రమంలో శ్రమించటం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇంచార్జ కడవకొల్లు నరసింహారావు, జడ్పీటీసీ సభ్యులు తుమ్మల మురళీకష్ణ, ఘంటసాల మార్కెట్ చైర్మన్ వేమూరి వెంకట్రావు, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, మాడెం నాగరాజు, సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, ఆర్డీవో వాణి, తహసీల్దార్ బి.రామానాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చల్లపల్లి అవనిగడ్డ నియోజకవర్గం చల్లపల్లిలో మండలంలోని వెలివోలు, నిమ్మగడ్డ, రాముడుపాలెం, అముదారులంక గ్రామాల రైతులకు లీజు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక రాజేశ్వరరావు వికాస కేంద్రంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, బందరు ఆర్డిఓ వాణి విచ్చేసి 838 మంది లంక భూముల రైతులకు 760 ఎకరాలకు లీజు పట్టాలు పంపిణీ చేశారు. పాగోలు, మాజేరుల్లో 158 మందికి సంబందించిన 39 ఎకరాలకు 22ఏ నుంచి తొలగించి విముక్తి ధవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ జోనల్ ఇన్చార్జ్ కడవకొల్లు నరసింహారావు, తహసిల్దార్ కే.గోపాలకష్ణ, సర్పంచులు, పిఎసిఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-పమిడిముక్కల : పెనుమచ్చ గ్రామాభివద్ధికి కట్టుబడి ఉన్నానని గ్రామ ప్రముఖులు మువ్వ రామ చంద్రరావు (రాము) అన్నారు. మాతృభూమి రుణం తీర్చుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. గురువారం ఆయన మండలంలోని గ్రామంలో ఇళ్లు కాలిపోయిన కుటుంబానికి రూ.20 వేల సహాయం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు, పశు వైద్య శిబిరాలు, పాఠశాలల అభివృద్ధికి పాటుపడుతున్నట్లు చెప్పారు. పెనుముచ్చ ట్రస్టు ద్వారా నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు కాలిపోయిన సందర్భంగా అభివద్ధి సాయం తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతమనేని రాంబాబు పాల్గొన్నారు

కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-హనుమాన్జంక్షన్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అంశాలైన వ్యవసాయాన్ని బలవం తంగా తన ఆధీనంలోకి తీసుకుని రైతుల అవసరాల పట్ల అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కార్యవర్గ సభ్యులు ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు వాపోయారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయస్థాయిలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు ఈనెల 27,28 తేదీలలో విజయవాడ జింఖానా గ్రౌండ్ లో జరిగే మహా ధర్నాకు రైతులు, కార్మికులను సమాయత్తం చేసే నిమిత్తం గురువారం రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి శాఖ కార్యవర్గ సమావేశం హనుమాన్ జంక్షన్ లోని లైన్స్ క్లబ్ ఆవరణలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రైతు సంఘాలు,ప్రజా సంఘాలు,రాజకీ పార్టీల నాయకులు పాల్గొని మహాధర్నా ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి తోట సాంబశివరావు,మండల టీడీపీ నాయకులు పుట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి-అవనిగడ్డ : జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టంను ప్రతిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సిబ్బంది ఈవో బి శివసామిరెడ్డి తెలిపారు గురువారం అవనిగడ్డ లోని సెయింట్ ఆన్స్ స్కానింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా పి సి పి ఎన్డిటి చట్ట పరిధిలో నమోదు చేయాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపును కూడా రద్దు చేయడం చేస్తామన్నారు. ముఖ్యంగా జిల్లాలో తక్కువ లింగ నిష్పత్తి గల ప్రాంతాలను గుర్తించి క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రజలలో అవగాహన కల్పిస్తామన్నారు. స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుమతులు అన్ని ఖచ్చితంగా ఉండాలని చెప్పారు. స్కానింగ్ కేంద్రాల వారు తమ కేంద్రాలకు వచ్చిన గర్భవతుల పూర్తి వివరాలను అనుమతిని తీసుకొని మాత్రమే స్కానింగ్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా గర్భవతులు వారి సంబంధికుల స్కానింగ్ కేంద్రాలకు వెళ్లి ఆడా మగా అని తెలుసుకోరాదన్నారు. లింగ నిర్ధారణ చేయుచున్న వారి సమాచారం తెలిపినచో వారి వివరాలను గోప్యంగా ఉంచి ఆయా కేంద్రాలపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకుడు రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు

స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

యాంటి బయోటిక్స్ నిరోధకంపై అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వాం ఆదేశాల మేరకు ఈ నెల 18 నుండి 24 వరకు యాంటి బయోటిక్స్ పై గురువారం దావాజీ గూడెం హై స్కూలులో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా మండల మండల పరిషత్ అధ్యక్షులు అనగాని రవి మాట్లుడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తినుబండారాలు, మందుల్లో కల్తీ పెరిగిపోతుందని దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కల్తీ నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్న ఉపయోగం ఉండటం లేదన్నారు. కల్తీలపై ప్రజలే అవగాహన పెంచుకోవాలన్నారు. కష్ణాజిల్లా పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.డి. శ్రీనివాసు యాంటీ బాడీస్ వల్ల కలిగే ఉపయోగాలను తెలిపారు. డా. ముక్తర డా.జి. సుఖష్ బాబు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో రూ నాలుగు లక్షల పదివేల తో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ తుంగల సమితి దేవి శంకుస్థాపన చేశారు. 67 మీటర్ల మేర నిర్మిస్తున్న ఈ రోడ్డు కోటగిరి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద నుండి ఆళ్ల సీతమ్మ ఇంటి వరకు ఈ రహదాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. లంక మామ వారి టెంపుల్ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు, వైసీపీ నాయకులు గాజుల పో తరాజు, గాజుల గోవి, మండల పార్టీ అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష పాల్గొన్నారు.

8 నుంచి అంగన్వాడీల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-గుడివాడ రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యల పట్ల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ డిసెంబరు 8 నుంచి నిరవదిక సమ్మె చేస్తున్నట్లు అంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటీయూ అధ్యక్షులు బేబిరాణి పేర్కొన్నారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో విజయ ఫ్లోరెన్స్కు అంగన్వాడీలు సమ్మె నోటీసు అందజేశారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు తదితర సమస్యల పై అనేక మార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెట్టారన్నారు. మార్చి 23న శాసనన మండలిలో ఐసీడీఎస్ మంత్రి అంగన్వాడీ యూనియన్లనతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేస్తామని ఇప్పటి వరకు వాటిని నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబరు 9న అధికారులతో జరిపిన చర్చలలో కూడా తమ సమస్యలు పరిష్కారం కాలేదని అందకనే సీఐటీయూ, ఎఐటీయూసి, ఐఎఫ్టియూ అనుబంద అంగన్వాడీ యూనియన్లతో వివిద రూపాలలో ఆందోళన కార్యకమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందిస్తున్న అంగన్వాడీలు

ఘంటసాల ఎండిఒగా అనూహ్య

పుష్పగుచ్చం అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- ఘంటసాల : ఘంటసాల మండల పరిషత్ అభివద్ధి అధికారిణిగా తుల్లిమెల్లి అనూహ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అను హ్యాకు పంచాయతీ కార్య దర్శులు జయలక్ష్మి, సీ.హెచ్.వీ.ఎస్.నాగమణి, రమాదేవి, బి.అర్జునరావు, జి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్చం అందజేసి మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిషత్ పరిపాలన అధికారి శ్రీనివాస చంద్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు కె.శ్రీని వాసరావు, ఎమ్.శివాజి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, దోనే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అడుసుమిల్లి గోపాలరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో 100 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం గురువారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై పి సి ప్రసాద్ లైన్స్ క్లబ్ ప్రతినిధులు పోలవరపు వెంకటరావు, పొట్లూరు రవి, జంగం మోహన్ రావు , ఆర్సిపిఎన్ వి విజయ్ బాబు పాల్గొన్నారు.

ఎస్ఐకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి ఎస్సైగా నూతన బాధ్యతలు చేపట్టిన కే వీరవెంకట సత్యనారాయణ ను పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం బాధ్యతలు తీసుకున్న ఎస్సైను గురువారం ఉదయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి అభినందనలు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్, నాగాయతిప్ప పంచాయతీ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివ నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వెంకటరాజేష్ బాబు, పిఎసఎస్ చైర్మన్ గరికిపాటి గోవిందరాజులు తదితరులు ఎస్సైను కలిసిన వారిలో ఉన్నారు

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల లోని వత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు ఆన్ జాబు ట్రైనింగ్ తరగతులకుఏ అండ్ టీ, ఓఎఎస్, ఎం ఈ టి విద్యార్థులకు కేటాయించిన కార్యాలయాలలో శిక్షణ పొందు తున్నారు. మొవ్వలోని ఎండిఒ, పిఎసిఎస్ కార్యాలయాలలో ఏ అండ్.టి కోర్సులోని మొదటి రెండు సంవత్సరాల విద్యార్థులు 61 మందికి వారికి కేటాయించిన కార్యాలయాలలో శిక్షణ కొన సాగిస్తున్నారు. అలాగేఒ ఏ ఎస్ గ్రూపులో 34 మంది విద్యార్థులు వారికి ఎంపిక చేసినసబ్ రిజిస్ట్రార్, ఐసిడిఎస్ ఆఫీసులలో సిబ్బంది శిక్షణ ఇస్తున్నారు. అదేవిధంగాఎం. ఈ. టి. మొద టిరెండు సంవత్సరాల 39 మందివిద్యార్థులు మచిలీపట్నంలోని సుధా గోల్డ్ కవరింగ్ ఫ్యాక్టరీలో శిక్షణ పొందుతున్నారు. ఆన్. జాబ్ ట్రైనింగ్.కుకష్ణా జిల్లా కలెక్టర్ పి రాజబాబు ఆదేశాలు జారి చేయడంతో వారందరినీ ఆయా కార్యాలయాలకు బుధవారం నుంచి పంపించినట్లు ప్రిన్సిపాల్ డి సుధాకర్ వివరించారు. ఈ శిక్షణను ఆయా సబ్జెక్టుఅధ్యాపకులైన కే. రంగనాయకులు, బి.గౌరమ్మ, సిహెచ్. ఆనంద్, ఆర్ విజయభేరి, ఏ వాసుబాబు, ఏం.ఆనందరావులు ఆయా కార్యాలయాలలో పర్యవేక్షిస్తున్నారు.

చంద్రాలలో 'పల్లెకు పోదాం'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పల్లెకుపోదాం కార్యక్రమం లో భాగంగా మండలంలోని చంద్రాల సచివాలయం వద్ద గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు .సంక్షేమ అభివద్ధి పథకాల బోర్డు ఆవిష్కరించి వాటి గురించి పార్టీ నాయకులు ప్రజలకు వివరించారు. గ్రామం లోని ప్రతి ఇంటింటికి వెళ్లి జగన్ మళ్ళీ ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అని ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ సాయన రవికుమార్, గ్రామ సర్పంచ్ , ఉప సర్పంచ్ నందం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజావసరాలపై ఇంత నిర్లక్ష్యమా?

ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు ప్రశ్న

ప్రజాశక్తి- గంపలగూడెం: నిత్యం వేలాది మంది రాకపోకలకు ప్రధాన వారధి అయిన కట్టలేరు వంతెన పట్ల ఇంత నిర్లక్ష్యం వహించడం సరైనది కాదని ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణ రావు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశాల్లో వంతెన నిర్మాణ విషయమై లక్ష్మణరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా ఇటీవల ప్రభుత్వ రోడ్లు, భవనాల ముఖ్య కార్యదర్శి నుండి వంతెన నిర్మాణ విషయమై పరిశీలనలో ఉన్నట్లు సమాధానం వచ్చినట్లు లక్ష్మణరావు తెలిపారు. ఈ విషయమై సాక్షాత్తు తిరువూరు వచ్చిన నేపథ్యంలో సిఎం 26 కోట్లు వంతెన నిర్మాణానికి ప్రకటిస్తున్నామని చెప్పినా జరగకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లక్ష్మణరావు ఉద్ఘాటించారు.

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రభుత్వ నర్సుల అసోసియేషన్‌కు ఎన్నికలెప్పుడు ?

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఎపి గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్‌కు ఎన్నికలను తాత్కాలికంగా నిలుపుదల చేశారని తమ సమస్యలను పరిస్కార వేదిక కోసం అసోషియేషన్ ఎన్నికలు అత్యవసరమని తక్షణమే ఎన్నికలు జరిపించాలని పలువురు నర్సులు కోరుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్‌కు ఎన్నికల నిర్వహణకుగానూ గత అక్టోబరులో సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధమైంది. తొలుత ఈనెల 25న ఎన్నికల నామినేషన్ ఉంటుందని, డిసెంబరు 13న ఎన్నికలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారన్నారు. అనివార్య కారణాల రీత్యా వాటిని నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో సభ్యులు నిరుత్సాహంగా ఉన్నారు. నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుదీర్ఘకాలంగా సమస్యలపై పోరాడుతున్నప్పటికీ సరైన గుర్తింపు లేదన్నారు. ఎన్నికలు నిర్వహించి అసోసియేషన్ ద్వారా సమస్యలు పరిష్కరించుకునేందుకు వేదిక ఏర్పడుతుందని పలువురు నర్సులు కోరుతున్నారు.

ట్రక్కును ప్రారంభిస్తున్న దృశ్యం

నగర మార్కెట్లోకి టాటా నూతన ట్రక్కు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : టాటా మోటార్స్ లిమిటెడ్ వారిచే నూతనముగా తయారు చేయబడిన ప్రైమా 2830టికె.వి.ఎక్స్ టిప్పర్ వాహనాన్ని ఆ సంస్థ వాణిజ్య వాహనాల ప్రెసిడెంట్ గిరీష్ వాఘ్ గురువారం విజయవాడ డీలర్ జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆవిష్కరించారు. సజ్జా నితిన్ చక్రవర్తికి మొదటి వాహనం తాళాలు గిరీష్ వాఘ్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదరు వాహనాన్ని నిర్మాణ రంగంలో అవసరాలకు తగ్గట్టుగా తయారు చేయబడిందని ప్రైమా 2830టికే. వి.ఎక్స్ ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టాటా మోటార్స్ లిమిటెడ్ రీజినల్ హెడ్, స్టేట్ హెడ్, డీలర్ జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైమేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బాడిగ సుమంత్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు.

పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నీ ...

ఎపి సర్కిల్‌కు బంగారు పతకం

టేబుల్ టెన్నిస్ ఆడుతున్న పోస్టల్ ఉద్యోగుల జట్లు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఆలిండియా పోస్టల్ ఉద్యోగుల టేబుల్ టెన్నిస్ పోటీల్లో గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్ బంగారు పతకం సాధించింది. ఫైనల్ మ్యాచ్ ఆంధ్రప్రదేశ్ - గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-0 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించి ప్రథమ స్థానం సాధించింది. దీనితో ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్ బంగారు పతకం సాధించింది.

గుజరాత్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. పురుషుల విభాగంలో వెస్ట బెంగాల్ - అస్సాం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-0 పాయింట్లతో వెస్ట్ బెంగాల్ జట్టు విజకం సాధించి ప్రథమ స్థానం సాధించగా అస్సాం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. శుక్రవారం వెటరన్స్ విభాగంలో సెమి ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్ జరుగనుంది.

29,30 తేదీల్లో హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ నెల 29, 30 తేదీల్లో నగరంలోని హోటల్ నోవాటెల్‌లో 'హై లైఫ్' బ్రైడ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఎగ్జిబిషన్ సిఇఒ పి.డామినిక్ తెలిపారు. రింగురోడ్డు వద్ద గల హోటల్ నోవాటెల్‌లో ఎగ్జిబిషన్ వివరాలను తెలియచేయడంతో పాటు టాప్ మోడల్స్‌తో ఫ్యాషన్ షోను గురువారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న శుభకార్యాలు, పండుగల సందర్భంగా నగర వాసులకు వస్త్రాలు, జ్యూయలరీని అందించేందుకుగానూ హై లైఫ్ పేరుతో బ్రైడల్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 29, 30 రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో ప్రముఖ సంస్థలకు చెందిన ఫ్యాషన్ బ్రాండ్‌లతో పాటు లైఫ్‌స్టైల్ ప్రొడక్ట్స్ ఉంటాయని తెలిపారు. డిజైనర్ అప్పెరల్స్, యాక్సెసరీస్, డ్రస్ మెటీరియల్స్, వెడ్డింగ్ జ్యూయలరీ, టెంపుల్ జ్యూయలరీ, ఫ్యాషన్ జ్యూయలరీ కూడా ఉంటాయని తెలిపారు. వెడ్డింగ్ శారీస్, అన్ని రకాల ఐటెమ్స్ ఉంటాయని తెలిపారు.

నేడు పిబి సిద్ధార్థలో 'కురుక్షేత్ర - 2023'

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారికి మంచి ఉన్నతవంతులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో పిబి సిద్దార్ధ కళాశాల ఎంబిఎ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ' కురుక్షేత్ర - 2023 ' పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డీన్ రాజేష్ సి.జంపాల తెలిపారు. మొగల్‌రాజపురంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం ఉదయం కురుక్షేత్ర - 2023 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాశక్తి కోసం గత 25 సంవత్సరాలుగా కురుక్షేత్ర పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రెండు తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో ఎంబిఎ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఎనిమిది విభాగాల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్, మార్కెట్ మేకర్స్, స్టాక్ గేమ్, హెచ్‌ఆర్ ఈవెంట్, స్టార్టప్ బిజినెస్ ఐడియా, ఫ్యాషన్ షో, మిస్టర్ అండ్ మిస్ కురుక్షేత్ర - 2023, వంటి అంశాల్లో పోటీలుంటాయని తెలిపారు. ఇప్పటికే 800 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ఎంబిఎ విభాగం అధ్యాపకులు డాక్టర్ రెహమాన్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

వ్యాసరచన పోటీ విజేతలుగా కాకతీయ- అపోలో విద్యార్థులు

ప్రజాశక్తి - నందిగామ : పుట్టపర్తి సాయిబాబా జన్మదిన వేడుకల సందర్భంగా 'ఆచార్యదేవోభవ' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో, స్థానిక నందిగామ కాకతీయ - అపోలో విద్యార్థులు మొత్తంగా 11 బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాల స్థాయిలో తెలుగులో మొదటి బహుమతి, సిహెచ్.కావేరీ, ద్వితీయ బహుమతి నిఖిత తతీయ బహుమతి బి.త్రివేణి సాధించారు. జిల్లాస్థాయిలో వై.శ్రీహరిత తతీయ బహుమతి సాధించారు. నందిగామ సత్యసాయి మందిరంలో యు.వాసుదేవరావు అధ్యక్షతన బహుమతులు అందుకున్నారు. ఈ వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులను, కాకతీయ అపోలో విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ డైరెక్టర్ కాపా భారతి ప్రిన్సిపాల్ ఎం.కవిత, ఉపాధ్యాయులు అభినందించారు.

కుక్క కాటుకు గురైన బాలుడిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

వీధి కుక్కల నుండి ప్రజలను కాపాడండి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజక వర్గంలోని 50 డివిజన్ మహంతిపురం ప్రాంతంలో వీధి కుక్క బుధవారం పలువురిని తీవ్రంగా గాయపరిచింది. డివిజన్‌కు చెందిన ఎస్.కె అయన్ కురేసి (11), సిహెచ్.శేఖర్ (38), కుమారి (47) మరో ఇద్దరిని కూడా గాయపరిచింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన నగరపాలక సంస్థ అధికారి విఎఎస్‌కి ఫిర్యాదు చేశారు. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల నియంత్రణ జరగకపోవడం వల్ల ప్రజలు ప్రాణాలు చేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు వీధి కుక్కల దాడికి ప్రజలు గురై బాధలు పడుతున్నారని, ప్రజల ప్రాణాల్ని రక్షించేలా నగరపాలక సంస్థ కమిషనర్ పుండ్కర్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

అపోలోలో రోబోటిక్ రేడియో సర్జరీ సెంటర్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఆరోగ్య సంరక్షణలో మరో కొత్త శకానికి నాంది పలుకుతో అపోలో కేన్సర్ సెంటర్‌ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి కె.ఎస్.రావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ అపోలో కేన్సర్ సెంటర్‌లో మొదటిసారిగా సైబర్ నైఫ్ ఎఫ్ 7 రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్‌ను పరిచయం చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కేన్సర్, కేన్సర్ కాని కణితులకు కచ్చితమైన చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నైఫ్ సిస్టమ్ ప్రవేశంతో కేన్సర్ సం రక్షణ, టెక్నాలజీలో గొప్ప వైద్యం అందిస్తుం దన్నారు. అత్యాధునిక వైద్య టెక్నాలజీని ప్రవేశ పెట్టిన సంస్థ అపోలో కేన్సర్ సెంటర్ అన్నారు.

సరికొత్తగా సోనీ మిర్రర్ లెస్ కెమెరా ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎలక్ట్రానిక్స్ వస్తువులలో అగ్రగామిగా ఉన్న సోనీ ఇండియా సరికొత్తగా మిర్రర్ లెస్ లెన్స్ కెమేరాను ఆవిష్కరించినట్లు సోనీ సెంటర్ మేనేజర్ ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సోనీ సెంటర్ వద్ద నూతన లెన్స్ కెమేరాలను గురువారం జరిగిన కార్యక్రమంలో పరిచయం చేశారు. మిర్రర్ లెస్క ఎమేరా ఎ6700 పేరుతో మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ నూతన ఆఫరింగ్ సరికొత్త ఫుల్ ఫ్రేమ్ ఆల్ఫా, సినిమా లైన్ సిరీస్‌లలో కనిపించే అత్యాధునిక స్టిల్ ఇమేజ్, వీడియో సామర్థ్యాలను కలిగి ఉందన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.